సాక్షి
జనగామ

సోమవారం | 17 | ఏప్రిల్ | 2023



అన్ని మతాలకు ప్రాధాన్యం

సర్వమత సామరస్యం పాటిస్తూ అన్ని మతాలకు ప్రభుత్వం పాధాన్యత కల్పిస్తోందని వరంగల్ నగర మేయర్ సుధారాణి అన్నారు. - 8లో▸



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ తెలంగాణ మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41°/25°

ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్న ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఎండ వేడి పెరుగుతుంది. రాత్రి ఉక్కపోత ఉంటుంది.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- ప్రభుత్వ సెంటర్ల ప్రారంభోత్సవంలో ఆలస్యం
- మద్దతు ధర కోల్పోతున్న రైతులు
- వెంటాడుతున్న వర్షాలు.. ఈదురు గాలులు

జనగామ: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం రాశుల కళ వచ్చింది. యాసంగి కోతలు ఊపందుకోవడంతో.. ఏఎంసీ రైతులతో కళకళాడుతోంది. జిల్లాలో రెండు మినహా.. ప్రభుత్వ కొనుగోలు సెంటర్లు ప్రారంభం కాకపోవడంతో ప్రైవేటు వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో సర్కారు ఆశించిన మేర అన్నదాతలకు గిట్టుబాటు ధర రావడం లేదు. రైతులకు మంచిధర వచ్చేలా మార్కెట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నా.. తేమ ఎక్కువగా ఉండంతో వ్యాపారులు ధర పెంచడంలో వెనకడుగు వేస్తున్నారు. నెల రోజుల్లో 12వేలకు పైగా క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.27లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ సారి రికార్డు స్థాయిలో వరిసాగు నమోదయ్యింది. ఇదే క్రమంలో గోదావరి జలాల రాక సైతం ఆలస్యం కావడంతో భూగర్భ జలాలు అడుగంటి చివరి దశలో ఉన్న పంటకు సాగునీరు అందించేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు భగ్గున మండిపోతున్న ఎండలు.. అడపదడపా కురిసిన వడగళ్లతో వరికి నష్టం తప్ప లేదు. రానున్న రోజుల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురి సే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో.. వరి కోతలు స్పీ డందుకున్నాయి. వ్యవసాయ క్షేత్రాల నుంచి నేరుగా ధాన్యాన్ని మార్కెట్‌కు తరలిస్తున్నారు. మరికొంత మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు కల్లాల్లోనే అమ్ముకుంటున్నారు.

నేరుగా మార్కెట్‌కే..

జిల్లాలోని ఐకేపీ, పీఏసీఎస్ శాఖలకు చెందిన 200 ప్రభుత్వ ధాన్యం కొ నుగోలు కేంద్రాల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. గత నెలలోనే యాసంగి వరి కోతలు మొదలు కావడంతో.. సెంటర్లను తక్షణమే ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఐదు రోజుల క్రితమే ఆదేశించారు. కానీ జిల్లాలో ఇప్పటి వరకు దేవరుప్పుల మండలంలో రెండు కేంద్రాలు మినహా.. ఇంకా ఎక్కడా ప్రారం భించలేదు. వరి పంట కోసిన తర్వాత మద్దతు ధర వచ్చే వరకు రైతుల వద్ద సరుకు నిల్వ చేసుకునే వీలు లేకుండా పోయింది. దీంతో వ్యవసాయ పొలం నుంచే నేరుగా జనగామ వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్నారు. గింజలో తేమ ఆరకపోవడం.. కొనుగోలు చేసే ట్రేడర్లు తక్కువగా ఉండంతో అన్నదాతలు ఆశించిన మేర ధర రావడం లేదు. మార్కెట్ అధికారులు మాత్రం వీలైనంత ఎక్కువ రేటు వచ్చేలా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



జనగామ మార్కెట్‌లో ధాన్యం రాశులు

మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్ల ధర వివరాలు

తేదీ	క్వింటాళ్లు	గరిష్టం	కనిష్టం	మోడల్ ప్రైజ్
1	348.40	1,713	1,503	1,653
3	802.75	1,701	1,529	1,649
4	643.50	1,658	1,529	1,590
8	1,285.70	1,635	1,509	1,589
10	1,173.25	1,639	1,509	1,589
11	1,320.15	1,667	1,509	1,589
12	1,094.60	1,671	1,511	1,609
13	1,720.70	1,656	1,523	1,596
15	3,571.75	1,683	1,503	1,589

12 వేల క్వింటాళ్ల కొనుగోళ్లు

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో గత నెల 4న ధాన్యం కొనుగోళ్లు ప్రారం భమయ్యాయి. 343మంది రైతుల వద్ద 12,563 క్వింటాళ్ల (19,328 బ్యాగులు) ధాన్యం కొనుగోలు చేశారు. ప్రభుత్వం మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ.2,060, సాధారణ రకం రూ.2,040గా ప్రకటించింది. మార్కెట్‌లో ఈ–నామ్ పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్ ధాన్యం గరిష్టంగా రూ.1,753, కనిష్ఠంగా రూ.1,503, మోడల్ ప్రైజ్ రూ.1,589, 1,609, రూ.1, 671 తదితర ధరలు పలుకుతున్నాయి. దీంతో రైతులు మద్దతు ధరతో పోల్చి చూస్తే.. క్వింటాలుకు సరాసరి రూ.300 నుంచి రూ.550 వరకు నష్ట పోతున్నారు. ధర పెంచాలని రైతులు కోరినప్పటికీ.. 30 శాతానికి పైగా తేమ ఉండడంతో ఇంతకంటే ఎక్కువ ఇవ్వలేమని చెబుతున్నారు. జిల్లాలో వందశాతం ప్రభుత్వ సెంటర్లు ప్రారంభిస్తే.. రైతులకు ధాన్యం ఆరబోసుకునే వెసులు బాటు ఉంటుంది. దీంతో రెండు, మూడు రోజుల పాటు తేమ పోయిన తర్వాత.. మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉంటుంది.



పెట్టుబడి ఎల్లలేదు..



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు గుగులోతు కేవులా. జనగామ మండలం మరిగడికి చెందిన రైతు తనకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట సాగుకు రూ.38 వేలకు పైగా ఖర్చు చేశాడు. 70 బస్తాలకు పైగా దిగుబడి వస్తుందని ఆశపడితే.. కోత కోసిన తర్వాత కేవలం 20 బస్తాలు మాత్రమే వచ్చాయి. తీవ్ర నిరాశకు గురైన రైతు.. చేసేది లేక అమ్ముకునేందుకు జనగా మ మార్కెట్‌కు వచ్చాడు. ధాన్యం నాణ్యత పరిశీలించిన వ్యాపారులు క్వింటాల్‌కు ధర రూ.1,579 ప్రకటించారు. మరో రూ.50 పెంచాలని రైతు అడిగినప్పటికీ.. తేమతో ఏమీ చేయలేమని తేల్చి చెప్పారు. సరుకు ఇంటికి తీసుకువెళ్లలేక.. వచ్చిన ధరకు అమ్ముకుని ఉసూరుమంటూ వెళ్లి పోయాడు. దీంతో పెట్టుబడిలో సుమారు రూ.20వేల వరకు నష్ట పోవాల్సి వచ్చింది.

క్వింటాకు రూ.1,582 మాత్రమే..



రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. పెట్టుబడుల కోసం రూ.40వేల వరకు ఖ ర్చు చేసిన. ఉన్న ఒక్కబోరు మోటారుతో వరిపంటకు సాగు నీరు అందిస్తూ కాపాడుకుంటూ వచ్చిన. గింజ గట్టిపడుతున్న సమయంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడం... అదే సమయంలో ఈదురు గాలులు, అడపదడపా వర్షాలు రావడంతో కొంతమేర దిగుబడి తగ్గిపోయింది. 75 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తే.. కేవలం 40 బస్తాలకు పడిపోయింది. ఊరిలో ప్రభుత్వ సెంటర్ ప్రారంభించక పోవడంతో.. అమ్ముకునేందుకు జనగామ మార్కెట్‌కు వచ్చిన. ధాన్యంలో తేమ ఎక్కువగా ఉంది.. క్వింటాల్‌కు రూ.1, 582కు కొనుగోలు చేశారు.

- తునికి రాజు, రైతు,మందోనిగూడెం, లింగాలఘనపురం

రజకుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి: రజక వృత్తిదారుల అభ్యున్నతికి టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామలో 29, 30వ తేదీల్లో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మంత్రి ఆదివారం తన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ రజక వృత్తిదారులకు 250 యూనిట్లు అందించామని తెలిపారు. మోడ్రన్ దోబి ఘాట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుమ్మడి రాజు నరేష్, పైళ్ల ఆశయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు రజక వృత్తిదారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదారు, సహాయ కార్యదర్శి జ్యోతిఉపేందర్, సర్పంచ్ భూమ రంగయ్య, మల్లేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కేయూ మూడేళ్ల లా సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్ మెంట్) నిర్వహించేందుకు టైంటేబుల్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక విడుదల చేశారు. ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24, 27, మే 1, 4, 8 తేదీల్లో.. మూడవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 28, మే 2, 5, 9, మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, మే 3, 6, 10 తేదీల్లో ఉంటాయని పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్బర్‌పాషా



స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని తానేదార్‌పల్లికి చెందిన అక్బర్‌పాషాను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఘన్‌పూర్‌లో ఆదివారం అక్బర్ పాషా విలేకర్లతో మాట్లాడారు. పార్టీలో తాను చేస్తున్న సేవలను గుర్తించి మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందని తెలిపారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అఫ్జల్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆరోగ్యం, నాయకులు వెంకటేష్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు దుస్తుల పంపిణీ



జనగామ రూరల్: తెలంగాణ ప్రభుత్వం పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల మసీదులో పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు అన్వర్, జనరల్ సెక్రెటరీ అబ్దుల్ ఖాదర్, షరీఫ్, దస్తగిరి, తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్ష

కాజీపేట సెంటర్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాల్లో 1,100 మంది విద్యార్థులకు గాను 810 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 290 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.

ప్రిన్సిపాల్‌కు అవార్డు



కరీమాబాద్: మామునూరు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.హనుమంతరావుకు మెరిటోరియస్ టీచర్ అవార్డు లభించింది. ప్రతి ఏటా పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేస్తుండగా.. 2022 సంవత్సరానికి హనుమంతరావు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం వర్సిటీ వైస్ చాన్సలర్ రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఎంపీ కవిత సుడిగాలి పర్యటన

నెల్లికుదురు: మండలంలోని పలు గ్రామాలల్లో ఎంపీ మాలోత్ కవిత ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరన్, సిమెంట్ షాపును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. చిన్నముప్పారం సర్పంచ్ చీకటి ప్రవీణ్ తండ్రి చీకటి జనార్దన్ మృతి చెందగా వారిని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం మునిగలవీడు గ్రామంలో మృతుల కుటుంబాలను సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బీరవెల్లి యాదగిరిరెడ్డి, నల్లాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యురాలు వాణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

జనగామ రూరల్: ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆదివారం కామాక్షి ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి అధ్యక్షతన రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రంలో ప్రతీ పండుగను వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ముస్లింలకు అనేక పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. షాదీ ముబారక్ వంటి పథకాలతో పేద ముస్లింలు లబ్ధిపొందుతున్నారని వివరించారు. మత సామరస్యాలతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ప్రతిఏటా ఇచ్చే రంజాన్ కానుకలను సైతం ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. అన్ని మతాలను గౌరవిస్తూ సమానంగా చూస్తున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. అంతకు ముందు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం జిల్లాకు వచ్చిన ఆయన 17 షాదీ ముభారక్ చెక్కులను, రంజాన్ కానుకలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మల్లవరపు అరవింద్‌రెడ్డి, కౌన్సిలర్లు సమ్మద్, నాగరాజు, కో ఆప్షన్ సభ్యులు రహిమాన్, ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, ఎంపీపీ కలింగరాజు, తహసీల్దార్ రవీందర్, ముస్లిం మత పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకుర్తి టౌన్: జాతీయ అగ్నిమాపక భద్రతా వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాద నివారణపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ విధానంపై పాలకుర్తి అగ్నిమాపక కేంద్ర అధికారి లేదాళ్ల దయాకర్ ఆధ్వర్యంలో అస్పత్రి సిబ్బందికి అగ్ని ప్రమాద నివారణ భద్రత చర్యలు వివరించారు. అగ్ని ప్రమాదలు నివారణపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కిరణ్‌కుమార్, శ్యామ్ సుందర్, సందీప్, అశోక్, వెంకటేష్, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భద్రత చర్యలను వివరిస్తున్న అగ్నిమాపక అధికారి దయాకర్

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- టీచర్లు, లెక్చరర్లతో ముఖాముఖి

విద్యారణ్యపురి: టీచర్లు, కళాశాలల్లో పనిచేసే లెక్చరర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించడంతో పాటు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ లా కళాశాలలో టీచర్లు, అధ్యాపకులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఉన్న స్టే తొలగించడానికి ఎర్లీ హియరింగ్ పిటిషన్ వేసి ఈ వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పెండింగ్, జీపీఎఫ్ తదితర బిల్లులు చెల్లించడంతోపాటు వేతనాలు ఒకటో తేదీనే చెల్లించాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డీఈఓల పూల్‌లో ఉన్న 7,000 ఉపాధ్యాయ ఖాళీలను ఐఎఫ్ఎస్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో చూపాలన్నారు. వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులకు 30శాతం వేతనాలు పెంచడంతోపాటు రెగ్యులరైజ్ చేయాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్, రెసిడెన్సియల్ పాఠశాలలు, కేజీబీవీలు, డిగ్రీ కళాశాలల్లో కేర్ టేకర్లను, పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అంతకు ముందు పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల బాధ్యులు పలు సమస్యలను ముఖాముఖిలో నర్సిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మేకరి దామోదర్, రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ముఖాముఖిలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఉపాధి పనుల్లో మహిళలే అధికం

- పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పిస్తే మరింత పెరిగే అవకాశం
- స్థానికంగా పనులు లేకపోవడంతో ఆసక్తి

జనగామ రూరల్: గ్రామీణ నిరుపేదలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఓ వరం లాంటిది. పనులు లేని వేసవి దినాల్లో ఉపాధి పనులు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కూలీలకు అండగా నిలుస్తోంది. ఈ పథకంలో రెండేళ్ల నుంచి పురుషుల కంటే మహిళలే ఎక్కువగా పనులను ఉపయోగించుకుంటున్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 281 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన కాల్వలు, చెరువులు, హరితహారం, ఫీడల్ చానల్, నర్సరీలు, ఇంకుడు గుంతలు, భూ అభివృద్ధి పనులు, హరితహారం, మట్టి రహదారుల నిర్మాణం, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, కంపోస్టు షెడ్డు నిర్మాణం, తదతర పనుల్లో మహిళలు,, పురుషుల కంటే ఎక్కువగా భాగస్వాములయ్యారు.

రూ.20 కోట్లుపైగా..

ఉపాధి హామీ పనులకు మహిళలే అధికంగా హాజరు అవుతున్నారు. జిల్లాలో 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో మహిళా కూలీలు రూ.20 కోట్లుకుపైగా ఆర్జించారు. మొత్తం 95,801 మంది కూలీలు పని చేయగా వారిలో మహిళలు 54,418 మంది, పురుషులు 41,383 మంది ఉన్నారు. పురుషులు రూ,1,297 లక్షలు, మహిళలు రూ, 2,077 లక్షల కూలి తీసుకున్నారు. ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకపోవడం, పనివేళలు అనువుగా ఉండడం స్థానికంగానే పనులు కల్పింస్తుండడంతో ఉపాధి పనులు చేసేందుకు అతివలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు చెబుతున్నారు.

వసతులు కల్పిస్తే మరింత పెరిగే అవకాశం

ఉపాధి హామీ పథకం ప్రారంభమైన మొదట్లో కూలీలకు అన్ని వసతులు కల్పించే వారు. క్రమక్రమంగా వసతులు లేమితో కొంత మేరకు కూలీలు తగ్గారు. రోజుకు 2 లేదా 3 గంటల వ్యవధిలో రూ.150 నుంచి రూ.272 వరకు సంపాధించుకునే ఆస్కారం ఉండడంతో వ్యవసాయ ఆధారిత కూలీలు సైతం ఉపాధి పనులపై మొగ్గు చూపుతున్నారు. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీల సంఖ్య తగ్గడంతో రైతులు గుత్త లెక్కన కూలీలను మాట్లాడుకుని పనులు చేయించుకుంటున్నారు.



శామీర్‌పేటలో ఉపాధి పనిలో పాల్గొన్న మహిళలు

జిల్లాలో మొత్తం గ్రామాలు: 281

పనిచేసిన వారు:

పురుషులు: 41,383 మహిళలు: 54,418

2021-22 సంవత్సరంలో పని చేసిన మహిళ కూలీల వివరాలు

బచ్చన్నపేట	5,980	చిల్పూరు	3,404
దేవరుప్పుల	5,901	స్టేషన్‌ఘన్‌పూర్	3,776
జనగామ	5,214	కొడకండ్ల	4,160
లింగాల ఘనపురం	3,563	నర్మెట	2,992
పాలకుర్తి	6,887	రఘునాథపలి	4,939
తరిగొప్పుల	3,066	జఫర్‌గడ్	4,536

కోరిన వారికి జాబ్ కార్డులు ఇస్తున్నాం..



గ్రామాల్లో ఉపాధి పనులు చేయడానికి పని కోరిన వారికి జాబ్ కార్డు అందజేస్తున్నాం. ఈ పనుల్లో పురుషుల్లో కంటే మహిళలే అధికంగా పనులకు హాజరు అవుతున్నారు. పని కోసం సంబంధిత గ్రామాల్లో క్షేత్ర సహాయకుడిని సంప్రదిస్తే వెంటనే జాబ్ కార్డు ఇచ్చి పనులు కల్పిస్తాం.

డీఆర్‌డీఓ, రాంరెడ్డి, జనగామ

బీజేపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట: దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో ఆ పార్టీ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని ఎమ్మెల్యే అరూరి రమేశ్ విమర్శించారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 67 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, బాధిత కుటుంబానికి రూ.2లక్షల విలువగల సీఎం ఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అరూరి రమేశ్ అందజేశారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం బండి సంజయ్ కళ్లకు కనపడుత లేదా అని ప్రశ్నించారు. రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు గండి కొడుతూ బీజేపీ నాయకులు నిరుద్యోగ మార్చ్ చేస్తే నమ్మేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీకి పాల్పడిన బండి సంజయ్ నిరుద్యోగ మార్చ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు ఇయ్యని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పాలన గురించి మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

జనగామ రూరల్: 2004లో తీసుకొచ్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ నుంచి జనగామ చౌరస్తా వరకు సీపీఎస్ కాన్సిట్యూషనల్ మార్చ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సొమ్మును కార్పొరేట్ శక్తులు, మార్కెట్ వ్యవస్థలో పెట్టుబడులు పెట్టడం వల్ల ఉద్యోగులు త్రీవంగా నష్ట పోతున్నారన్నారు. ఆర్టికల్ 309 పెన్షన్ విధానం రాష్ట్ర పరిధిలోకి వస్తుందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత రూ.500 నుంచి రూ.2వేల వరకు పెన్షన్ రావడం లేదని ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణం పాత పెన్షన్ విధానం కొనసాగించాలని వారు డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలీపాషా, కోశాధికారి సునీల్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శంకర్, విద్యావతి, స్వప్న, చంద్రశేఖర్, లక్ష్మయ్య, అంజయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



జనగామ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మేడారంలో భక్తుల సందడి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో సదూర ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, చీరసారె, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకున్నారు. ఇటీవల పదోతరగతి పరీక్షలు ముగియడంతో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల ప్రాంతాల్లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

అతిపెద్ద ప్లాస్టిక్ సర్జరీ

ఎంజీఎం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తొడ పిరుదుల భాగంలో ఊడిపోయిన చర్మానికి ప్లాస్టిక్ సర్జరీలో భాగంగా నిర్వహించిన అతిపెద్ద శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తిచేశామని వరంగల్‌లోని గార్డియన్ హాస్పటల్ ఎండీ డాక్టర్ కాళీప్రసాద్ ఆదివారం వెల్లడించారు. ఫిబ్రవరి 23న కడిపికొండ బ్రిడ్జి వద్ద వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కీర్తి సునీత(37) రోడ్డు ప్రమాదానికి గురైందని, సునీతపై నుంచి లారీ వెళ్లడంతో తొడ, పిరుదుల భాగం చర్మం ఊడిపోగా హుటాహుటిగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారని వివరించారు. నాలుగు రోజుల చికిత్స అనంతరం గార్డియన్‌లో చేరినట్లు తెలిపారు. ఈ మేరకు ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఉపేందర్, ఆర్థో వైద్యనిపుణులు కాళీప్రసాద్, డాక్టర్ శాంతన్‌కుమార్, డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేసి ప్రాణాపాయస్థితి నుంచి ఆమెను కాపాడినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాలోనే తొలిసారిగా ఈ తరహా ఆపరేషన్ చేసినట్టు డాక్టర్ కాళీ ప్రసాద్ పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

డోర్నకల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాసిం తెలిపారు. డోర్నకల్ రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ నాయకులు బషీర్, గారె రమేష్, బాబు, దళిత సంఘ నాయకులు కామ సంజీవరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తలారి విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆత్మహత్య

హసన్‌పర్తి: ఆర్థిక ఇబ్బందులతో ఓ జూనియర్ లైన్‌మెన్ కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన భూక్యా రవి (47) గాయత్రినగర్‌లో ఉంటూ గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబపోషణ నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు పెరిగిపోవడంతో ఆందోళనకు గురై ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. రవికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

'డ్రాగన్' సాగులో సాఫ్ట్‌వేర్

- లక్షల జీతం వదిలి వ్యవసాయం
- డెయిరీ ఫామ్, కడక్‌నాథ్ కోళ్ల పెంపకం కూడా..
- ఆదర్శంగా నిలుస్తున్న భూక్యా తిరుపతి నాయక్


ట్రెల్లీస్ పద్ధతిలో సాగు చేస్తున్న, డ్రాగన్ ఫ్రూట్ తోటలో తిరుపతి

తరిగొప్పుల: మల్టీ నేషనల్ కంపెనీలో గౌరవప్రదమైన ఉద్యోగం.. నెలకు ఐదు లక్షల రూపాయల వేతనం.. అమెరికాలో విలాసవంతమైన జీవనం.. అన్నింటినీ వదులుకుని స్వగ్రామంలో రైతుగా మారాడు ఓ యువకుడు. తల్లిదండ్రులు చేస్తున్న వ్యవసాయంపై మమకారంతో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. సాగులో రైతులు ఎదుర్కొనే కష్టనష్టాలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఓ యువ సాఫ్ట్‌వేర్ సాగు బాటపట్టాడు. వ్యవసాయం మీద ఉన్న మక్కువతో స్వగ్రామంలో ఇది వరకు ఏ రైతు సాగు చేయని పంటను పండిస్తున్నాడు. అమెరికా, చైనా వంటి దేశాల్లో అధిక మొత్తంలో సాగయ్యే డ్రాగన్ ఫ్రూట్స్ పంటను మండలానికి కొత్తగా పరిచయం చేస్తున్నాడు. తొమ్మిది ఎకరాల్లో సాగు చేయాల్సిన డ్రాగన్ ఫ్రూట్‌ను ట్రెల్లిస్ పద్ధతిలో 18,000 వేల మొక్కలతో నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. డిమాండ్ ఉన్న పండ్లను ఎంచుకుని సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందంటున్నాడు.

తరిగొప్పుల మండలంలోని జాలుబాయితండాకు చెందిన భూక్య దేవా, రుక్కమ్మ దంపతుల కుమారుడు భూక్య తిరుపతి హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ బీటెక్ పూర్తి చేసి, మాస్టర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివేందుకు 2014లో అమెరికా వెళ్లాడు. 2016 మాస్టర్స్ పూర్తి చేశాడు. అనంతరం ఆపిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. నెలకు రూ.5 లక్షల జీతం. కానీ, ఉద్యోగంతో సంతృప్తి చెందక వ్యవసాయంపై ఉన్న మక్కువతో స్వగ్రామంలో ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు తనకున్న వ్యవసాయ భూమిలో రూ.60 లక్షల ఖర్చు చేసి శ్రీ సాయిరాం డైరీ ఫామ్‌ను ఏర్పాటు చేశాడు. రెండు నెలల క్రితం 4 ఎకరాల్లో మొరాకోరెడ్, అమెరికన్ బ్యూటీ, లీసా, సీ వెరైటీ రకాల డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు ప్రారంభించాడు. దీంతోపాటు స్వచ్ఛమైన పాల కోసం రూ.2.20 లక్షలతో గుజరాత్ నుంచి గిర్ జాతి ఆవులు తెప్పించాడు. అదేవిధంగా తమిళనాడు నుంచి 200 కడక్‌నాథ్ కోడి పిల్లలను తెప్పించి పెంచుతున్నాడు. మరో ఏడాది, రెండేళ్లలో డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి ప్రారంభం అవుతుందని చెబుతున్నాడు తిరుపతి నాయక్. లక్షల వేతనాన్ని వదిలి వ్యవసాయం వైపు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భూక్యా తిరుపతి నాయక్ తాను ఎంచుకున్న రంగంలో రాణించాలని ఆశిద్దాం.


గిర్ జాతి ఆవుతో..

వ్యవసాయం చేయాలనే తపన

పరాయి దేశంలో లక్షలు సంపాదించినా సంతృప్తి లేదు. ఆర్గానిక్ వ్యవసాయం చేయాలని అనుకున్నాను. అందుకే మల్టీనేషనల్ ఐటీ కంపెనీలో ఉద్యోగం వదిలేశాను. ప్రపంచ మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్‌కు డిమాండ్ అధికం. అందుకే ఆ పండ్లను సాగు చేయాలని నిర్ణయించుకున్నాను. దీంతోపాటు సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్నాను. త్వరలోనే ఫ్రెష్ ఫాం మార్కెట్ ఏర్పాటు చేసి తాజా కూరగాయలు విక్రయిస్తాను.

-భూక్యా తిరుపతి నాయక్

వెల్‌డన్ యశ్వంత్

- గవర్నర్‌ను కలిసిన మౌంటనర్ యశ్వంత్


యశ్వంత్‌ను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటనర్ భూక్య యశ్వంత్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా గవర్నర్ యశ్వంత్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. చిన్న వయస్సులో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రపంచంలోని అతిశీతల పర్వతాలను అధిరోహించడం ఎంతో గొప్పవిషయమన్నారు. అంత ఎత్తులో ఉన్న పర్వత శిఖరాలపై జాతీయ జెండాను ఎగరవేసి భారత ఖ్యాతిని యావత్ ప్రపంచానికి చాటిన యశ్వంత్ ధైర్య సాహసాలను గవర్నర్ అభినందించాడు. ఈ నెల ఆస్ట్రేలియాలోని పర్వతారోహణకు వెళ్తున్నట్లు యశ్వంత్ గవర్నర్‌కు వివరించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించే విధంగా కృషి చేయనున్నట్లు గవర్నర్ చెప్పినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రపంచంలోని పేరుగాంచిన మరెన్నో పర్వతారోహణలు చేపట్టి దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని గవర్నర్ సూచించినట్లు తెలిపాడు.

అలుపెరుగని జీవితం రైతన్నది

- సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్


మిర్చితోటలో కాయలు తెంపుతున్న సబ్ రిజిస్ట్రార్

ములుగు రూరల్: ప్రకృతితో పోరాడుతూ అలుపెరుగని జీవితం గడిపేది రైతన్న అని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సెలవు రోజు కావడంతో మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక ఉత్తమ్‌కుమార్ – అర్పితలకు చెందిన మిరపతోటలో కూలీ పనులకు వెళ్లారు. తోటి కూలీలతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి కలివిడిగా గడిపారు. రైతు ఇచ్చిన కూలీ డబ్బులు రూ.200లకు మరికొంత డబ్బు కలిపి నిరుపేద కూలీకి అందించారు. జిల్లా స్థాయి అధికారి కూలీలతో కలిసి వ్యవసాయ పనుల్లో పాల్గొనడంతో కూలీలు ఆశ్చర్యానికి గురయ్యారు.

దృష్టి మరల్చి దొంగతనం

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్ క్రైం: దృష్టి మరల్చి దొంగతనానికి పాల్పడిన ములుగు జిల్లా బండారుపల్లికి చెందిన చించు, గుగులోతు స్వప్న, వెంకటాపూర్ మండలం నల్లకుంటకు చెందిన ఇటికల సురేందర్‌లను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. హన్మకొండ బాలసముద్రంలో రామాంచ కొంరమ్మ వృద్ధురాలిని మెడలో గొలుసు ఇవ్వాలని, ఒక ఫోటో తీసుకోని ఇస్తామని నమ్మబలికి పరార్ అయినట్లు ఆయన తెలిపారు. నిందితులు హనుమకొండ బాలసముద్రంలో రామాంచ కొమురమ్మ అనే వృద్ధురాలి మెడలో గొలుసు ఇవ్వాలని, ఫొటో తీసుకుని ఇస్తామని నమ్మించి పరారయ్యారు. వారిని స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధి టైలర్ స్ట్రీట్‌లో పట్టుకుని రూ.50 వేల విలువైన 12 గ్రాముల బంగారు గొలుసు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మాయమాటలు చెప్పే వారిని నమ్మి విలువైన వస్తువులు ఇవ్వొద్దని సూచించారు.


అన్ని మతాలకు ప్రాధాన్యం

- మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ సారయ్య


ఈద్గా మసీదులో సీసీ కెమెరాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ తదితరులు

ఖిలా వరంగల్: సర్వమత సామరస్యం పాటిస్తూ అన్ని మతాలకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర రోడ్లు, భవనాల సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఈద్గా మసీదు ప్రాంగణం, ఖబ్రస్తాన్‌లో దర్గా కేర్‌టేకర్ ఎంఏ తస్వీర్ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ముస్లిం మహిళల ఉపాధి కల్పనకు కుట్టుమిషన్లు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుస్రుపాషా, ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ మోహినుద్దీన్ ఖాద్రి, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, మాజీ కార్పొరేటర్ ఎంబాడి రవీందర్, ఎంఏ తస్వీర్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో 'వనం' హఠాన్మరణం


సంపత్‌కుమార్‌రావు (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ శ్రీనగర్‌కాలనీకి చెందిన వనం సంపత్‌కుమార్‌రావు (66) భారత కాలమానం ప్రకారం అమెరికాలోని వర్జీనియాలో శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. సంపత్‌కుమార్ హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల, భద్రాచలం, మహబూబాబాద్ డిగ్రీ కళాశాలల్లో లైబ్రేరియన్‌గా పని చేసి 2014లో రిటైర్ అయ్యారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. అమెరికాలో ఉండే కుమార్తె వద్దకు ఈ నెల 4వ తేదీన వెళ్లిన ఆయన గెండెపోటుతో మృతిచెందారు. కాగా, బుధవారం వరకు పార్థివదేహం ఇండియాకు వస్తుందని సంపత్ బావమరిది శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కళాశాల టీచర్ల సంఘం అధ్యక్షుడు పులి సారంగపాణి, కార్యదర్శి మల్లారెడ్డి, సత్యనారాయణరావు, కృష్ణమూర్తి, ఎన్వీఎన్ చారి, సంఘం బాధ్యులు సంతాపం ప్రకటించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ


విజేతలతో సుధాకర్(ఎడమ పక్క నిల్చున్న వ్యక్తి)

డోర్నకల్: హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ తెలంగాణ మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్ భారత్‌వీర్ వ్యాయామశాల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. చిక్కడపల్లి బీఎస్ఎన్ఎల్ కమ్యూనిటీ హాలులో మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో భారత్‌వీర్ వ్యాయామశాలకు చెందిన క్రీడాకారుడు మండలోజు సుధాకర్ 55–60 సంవత్సరాల కేటగిరిలో 73 కేజీల విభాగం నుంచి పాల్గొని క్లీన్ 60 కేసీలు, స్నాచ్ 50 కేజీల బరువు కలిపి 110 కేజీల బరువు ఎత్తి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. 35–40 సంవత్సరాల కేటగిరిలో 73 కేజీల విభాగంలో క్లీన్ 60 కేజీలు, స్నాచ్ 50 కేజీలు కలిపి 110 కేజీల బరువు ఎత్తి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు. సుధాకర్‌ను మంత్రి సత్యవతిరాథోడ్ సన్మానించారు.

ఏసీపీ నేతృత్వంలో హత్యకేసు దర్యాప్తు

- పోలీసుల అదుపులో నిందితులు..!
- కొనసాగుతున్న విచారణ

ఖిలా వరంగల్: ‘తమ్ముడిని చంపిన అన్న’ హత్య ఘటన నగర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఆదివారం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ నేతృత్వంలో శ్రీకాంత్ హత్య కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. తమ్ముడిని అన్న కర్రతో కొట్టి.. శరీరంపై పెట్రోల్ పోసి.. ఆపై బండరాయితో మోది హత్యచేసిన ఘటనను పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నారు. తన వాటాకు వచ్చిన ఇంటి స్థలాన్ని విక్రయించి నగరం నుంచి దూరంగా వెళ్తున్నానని చెప్పినందుకే శ్రీకాంత్‌పై అన్న గోవిందుల శ్రీధర్ కక్ష పెంచుకొని తమ్ముడిని హత్యచేశాడని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. హత్యకు ఉపయోగించిన కర్ర, పెట్రోల్ డబ్బా, బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంత్ హత్యకేసులో అనుమానితులైన గోవిందుల శ్రీధర్, అతడి భార్య గోవిందుల అనిత, అతడి వదిన గోవిందుల రాజమ్మను శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితులను పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఆత్మకూరు: బావమరిది, అత్త దూషించారని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని అక్కంపేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అక్కంపేటకు చెందిన మాదాసి మధుకర్(30)కు పైడిపెల్లికి చెందిన మానసతో 4 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి తరచుగా గొడవ జరిగేది. ఈ క్రమంలో మధుకర్ బావమరిది రమేష్, అత్త వరలక్ష్మి మధుకర్‌ను దూషించారు. దీంతో మనస్తాపానికి గురై శనివారం అక్కంపేటలో కెనాల్ వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మధుకర్ తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

హన్మకొండ చౌరస్తా: వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు ఆస్పత్రి ఎదుట ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు చెందిన రమ(30) కడుపులో సమస్యతో బాధపడుతుండగా.. ఈనెల 13న హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు రమను అడ్మిట్ చేసుకుని మరుసటి రోజు ఆపరేషన్ చేశారు. శనివారం సాయంత్రమే రమ మృతి చెందినప్పటికీ ఆరోగ్యశ్రీ నుంచి డబ్బులు ఆస్పత్రిలో జమయ్యాక ఆదివారం సాయంత్రం తెలియజేశారని మృతురాలి బంధువులు రోదిస్తూ చెప్పారు.

క్షుద్రపూజల కలకలం


ఓ ఇంటిఎదుట పసుపు, కంకుమ

వరంగల్ చౌరస్తా: వరంగల్ 26వ డివిజన్‌లోని గిర్మాజీపేట రామావారి వీధిలో క్షుద్రపూజలు కలకలం రేపుతున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా రామావారి వీధిలో ఒక రోజు ఒక ఇంటి ఎదుట పసుపు, కుంకుమ, మరో రోజు మరో ఇంటి ఎదుట కోడిగుడ్లు, జీడిగింజలు, గవ్వలు, ఆదివారం చనిపోయిన కోడి, గుడ్లు, తదితర వస్తువులు ఇళ్ల ఎదుట కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పోలీసు సిబ్బంది వివరాలు సేకరించి వదిలేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇస్తున్నారని పేర్కొంటున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఇసుక లారీ


విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కాల్వపల్లి నుంచి ఇసుక లోడుతో వెళ్తున్న లారీకి బ్రేకులు ఫెయిల్ అయి ఒడితల మూల మలుపు వద్ద 11కేవీ విద్యుత్ స్తంభానికి ఆదివారం ఢీ కొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయి విద్యుత్ వైర్లు కింద పడ్డాయి. అలాగే పాఠశాల ప్రహరీ కూలిపోయింది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా బస్టాండ్ సమీపంలో ప్రజలు నిత్యం ఉండేవారని, ఎండకాలంగా కావడతో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సందర్శించి అక్కడి నుంచి లారీని తొలగించారు. ఇదిలా ఉండగా.. గ్రామంలో విద్యుత్ సరాఫరా నిలిచిపోవడతో సర్పంచ్ ఎర్రబెల్లి సాంబలక్ష్మీ విద్యుత్ సిబ్బందిచే మరమ్మతులు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


మల్లయ్య(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారి జాన్‌పాక్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిరుకుల మల్లయ్య(80) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వంచనగిరికి చెందిన మల్లయ్య సాయంత్రం 6 గంటల సమయంలో వరంగల్ వైపు నుంచి తన గ్రామానికి సైకిల్‌పై వెళ్తుండగా నర్సంపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

మస్కట్‌లో అంబేడ్కర్ పుస్తకావిష్కరణ



నెక్కొండ/కాజీపేట అర్బన్: అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఒమాన్‌లోని మస్కట్‌లో ఎన్ఆర్ఐ వింగ్ వైస్ ప్రెసిడెంట్ షేక్ అహ్మద్, ఎన్ఆర్ఐ ఒమాన్ మహమ్మద్ ఇమామ్ ఆధ్వర్యంలో ఈనెల 14న శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెక్కొండ మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి పాస్ట్రేట్ చైర్మన్ కవి, రచయిత డాక్టర్ రేవ పెండ్యాల బాబురావు ఆదివారం వివరాలు వెల్లడించారు. తను రాసిన రచనలతో కూడిన పుస్తకాన్ని మస్కట్‌లో ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన వెంట జాన్ విక్టర్, రాజారత్నం, మోహన్, అనిల్, ఆంజనేయులు, రామ్‌దాస్, చంద్రిక ఉన్నారు.

అక్కాతమ్ముళ్లను కలిపిన 'బలగం'


లింగారెడ్డి


పప్పు లక్ష్మి

లింగాలఘణపురం: మండల పరిధి వనపర్తిలో ఇటీవల ప్రదర్శించిన 'బలగం' సినిమా మనస్పర్థలతో దూరమైన అక్కా.. తమ్ముడి కుటుంబాలను కలిపింది. వివరాలిలా ఉన్నాయి. అనుముల లింగారెడ్డి, లక్ష్మి అక్కా తమ్ముళ్లు. లక్ష్మిని అదే గ్రామంలో పప్పు వీరారెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. రెండు కుటుంబాలు వనపర్తిలోనే ఉంటున్నాయి. 15 ఏళ్ల క్రితం లింగారెడ్డి కూతురు రజిని వివాహవేడుకల్లో లక్ష్మిని ఫొటో తీయకపోవడంతో భోజనం చేయకుండా అలిగి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆ రెండు కుటుంబాల మధ్య సంబంధాలు దూరమయ్యాయి. ఏడాదిన్నర క్రితం లక్ష్మి భర్త వీరారెడ్డి మృతి చెందగా.. అంత్యక్రియల సమయంలో లింగారెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నాడు. దీంతో అతడి భార్య వసంత, కొడుకు శ్రీకాంత్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లొచ్చారు. అయినా రెండు కుటుంబాలు కలిసిపోలేదు. ఇటీవల సర్పంచ్ ఉంగరాల శ్రీధర్ గ్రామంలో బలగం సినిమాను పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఆ సినిమా చూసిన లింగారెడ్డి, లక్ష్మి హృదయాల్లో మార్పు వచ్చింది. పంతాలు వదిలేసి సర్పంచ్ శ్రీధర్, గ్రామస్తులు మహేష్, రవీందర్‌రెడ్డి సమక్షంలో ఈనెల 15న లింగారెడ్డి తన అక్క లక్ష్మి ఇంటికి వెళ్లాడు. దీంతో గ్రామస్తులంతా సంతోషం వ్యక్తం చేశారు.


అక్క లక్ష్మి ఇంట్లోకి వెళ్లి బోరున విలపిస్తున్న లింగారెడ్డి